

సీలేరు కాంప్లెక్స్ సీఈగా వాసుదేవరావు



సీలేరు, జూన్ 29: సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా జీఎం వాసుదేవరావును నియమిస్తూ ఏపీజెన్‌కో ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్న వాసుదేవ రావును పదోన్నతిపై సీలేరు సీఈగా బదిలీ చేశారు. ప్రస్తుతం సీఈగా పనిచేస్తున్న జవహర్ ఆదివారం పదవీ విరమణ చేపట్టనుండడంతో నూతన ఎస్ఈని నియమించారు. ఆయన సోమవారం విధుల్లో చేరనున్నారు.

విద్యాబోధన పేలవం

ఆరో తరగతికి వచ్చినా చదవడం, రాయడం రావడం లేదు

- పదో తరగతి విద్యార్థి ఇంగ్లీషు పదాలు చదవలేకపోయారు
- ఏజెన్సీలో ఉపాధ్యాయుల పనితీరుపై పెదవివిరుపు
- సమయపాలన పాటించడం లేదని, అధికారుల పర్యవేక్షణ శూన్యమని ఫిర్యాదులు
- జడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యుల ఆందోళన
- ఏకీభవించిన జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- ఎంఈవోల కొరతతో పర్యవేక్షణ కొరవడిందని డీఈవో అంగీకారం
- చర్యలు తీసుకుంటానని హామీ



జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర (ఇన్‌సెట్‌లో) విద్యా వ్యవస్థపై మాట్లాడుతున్న మత్స్యలింగం

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):
అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఐటీడీఏ పరిధిలో ప్రాథమిక విద్య అత్యంత నాసిరకంగా ఉందని, విద్యార్థులకు బోధించడంలో ఉపాధ్యాయులు శ్రద్ధ చూపడం లేదని జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఆరో తరగతికి వచ్చే విద్యార్థికి కనీసం రాయడం, చదవడం రాదని, విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో విద్యాశాఖ వైఫల్యం చెందిందని సమావేశం అభిప్రాయపడింది. శనివారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన రెండు, నాలుగో స్థాయీ సంఘ సమావేశాలు జడ్పీ హాలులో జరిగాయి. నాలుగో స్థాయి సంఘ సమావేశంలో విద్యాశాఖపై చర్చను అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ప్రారంభిస్తూ, ఇటీవల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలకు వెళ్లే కొందరు ఐదో తరగతి విద్యార్థులను అక్కడ ప్రిన్సిపాల్ ఒక కాగితంపై రాసిన పదాలు చదవాలని, మరికొన్ని పదాలు రాయాలని సూచించారన్నారు. అయితే ఒకరిద్దరు తప్ప మిగిలిన విద్యార్థులు చదవడం, రాయడం రాక తెల్లమొఖాలేస్తే తను సిగ్గుతో తలదించుకోవల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా పదో తరగతిలో 528 మార్కులు వచ్చిన విద్యార్థి కూడా రెసిడెన్షియల్ కళాశాలలో ప్రవేశాల సమయంలో ఇంగ్లీష్ పదాలు చదవలేకపోయారని విచారం వ్యక్తం చేయగా.. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర జోక్యం చేసుకుని ఏజెన్సీలో విద్యాప్రమాణాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. విద్యార్థులను రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు సిఫారసు చేసినపుడు వారి ప్రమాణాలపై సంబంధిత ప్రిన్సిపాళ్లు పెదవివిరుస్తున్నారని వాపోయారు. చివరకు తెలుగులో రాయలేకపోవడం చూస్తే టీచర్ల పనితీరు ఎంత పేలవంగా ఉందో అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం మాట్లాడుతూ టీచర్లు పాఠాలు చెప్పడం లేదని, కొందరు సమయపాలన పాటించరని ఆరోపించారు. పాఠశాలలు పునఃప్రారంభించి రెండు వారాలు దాటినా కొన్నిచోట్ల స్కూళ్లు తెరుచుకోలేదని విమర్శించారు. చివరకు విద్యాశాఖ అజమాయిషీ లేదని, పాఠశాలల తనిఖీలు నిర్వహించడం లేదని వ్యాఖ్యానించగా.. ఆయన వాదనతో జడ్పీ చైర్‌పర్సన్ ఏకీభవించారు. దీనిపై అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ వివరణ ఇస్తూ.. ఏజెన్సీలో 16 ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ కొంతవరకు లోపించిందన్నారు. సభ్యుల ఆవేదనను తను అర్థం చేసుకున్నానని పేర్కొంటూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉద్యాన రైతులకు ఊతమేది?

ఉద్యాన వన తోటల పెంపకంలో భాగంగా రైతులకు ఎండిన, నాసిరకం మొక్కలు అందజేస్తున్నారని జడ్పీ స్థాయి సంఘాల సభ్యులు ఆరోపించారు. డ్వామా విభాగంపై జరిగిన చర్చలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ రైతులు కోరుకునే మొక్కలు కాకుండా అధికారులు తమకు ఇష్టమైన మొక్కలు ఇస్తున్నారన్నారు. ఏజెన్సీలో డ్వామా విభాగం చర్చలో హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణాలను నిధులు ఉన్నా అధికారులు ఎందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంలేదని నిలదీశారు. ఇంకా డోలీమోతలు కొనసాగాలా? అని మండిపడ్డారు. అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్ల నిర్మాణాల కోసం అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకోవడంలేదని ఫిర్యాదుచేయగా జడ్పీ సీఈవో పోలినాయుడు జోక్యం చేసుకుని అటవీ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని అల్లూరి జిల్లా డ్వామా పీడీ శివయ్యకు సూచించారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో బాధ్యతలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలను అభినందిస్తూ మంచి పాలన అందించాలని ఆకాంక్షించారు. డీఆర్‌డీఏపై జరిగిన చర్చలో గొలుగొండ, అనకాపల్లి జడ్పీటీసీ సభ్యులు గిరిబాబు, సత్యవతి మాట్లాడుతూ ఒకటో తేదీన ఇచ్చే పెంచిన పింఛన్ల పంపిణీలో గ్రామ, మండల స్థాయిలో ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించాలని కోరగా.. జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుంటూ పింఛన్ల పంపిణీకి జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించాలని, లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇకపై రైతు సేవా కేంద్రాలు

రైతు భరోసా కేంద్రాల పేరును మార్చిన కూటమి ప్రభుత్వం

- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్
- ఆర్‌బీకే భవన నిర్మాణాలపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- ఏజెన్సీలో మొత్తం 209 భవనాలు, పూర్తయినవి 20 మాత్రమే

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ నుంచి వివిధ శాఖల్లో ప్రక్షాళన మొదలైంది. అందులో భాగంగా వ్యవసాయ శాఖలోనూ కొన్ని మార్పులకు శ్రీకారం చుడుతున్నది. గత వైసీపీ ప్రభుత్వం 'వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రాలు'గా ఉన్న వాటిని 'రైతు సేవా కేంద్రాలు' పేరు మారుస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు వ్యవసాయ సంబంధ సేవలను అందించేందుకు 'వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రం' పేరిట భవనాలను సమకూర్చారు. కాని ఆశించిన స్థాయిలో పనిచేయలేదనే విమర్శలున్నాయి.



హుకుంపేట మండలం కొట్నాపల్లిలోని ఆర్‌బీకే భవనం

ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం

వ్యవసాయ శాఖ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. అలాగే గత ప్రభుత్వం 'వైఎస్‌ఆర్ రైతు భరోసా' పేరిట వ్యవసాయంపై ముద్రిస్తున్న మాసపత్రిక ఇకపై 'పాడిపంటలు'గా వెలువడుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషన్ సీహెచ్.హరికృష్ణ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఇకపై ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పిలవబడతాయి.



అరకులోయ మండలం చొంపిలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌బీకే భవనం

ఆర్‌బీకేలపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం

వైఎస్.జగన్ తన తండ్రి, దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి పేరుతోనే వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రాలుగా నామకరణం చేసినప్పటికీ వాటి భవన నిర్మాణాలపై వైసీపీ ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం కొనసాగించింది. దీంతో అనేక ప్రాంతాల్లో మండల వ్యవసాయాధికారి కార్యాలయంలోనే రైతులకు సంబంధించిన వ్యవహారాలను చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏజెన్సీ 11 మండలాల పరిధిలో 209 రైతు భరోసా కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మించాలని 2020లో పనులు ప్రారంభించారు. కానీ నేటికీ కేవలం 20 మాత్రమే పూర్తి కాగా.. 189 భవనాలు వివిధ దశల్లో అసంపూర్తిగానే ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే.. పునాదులు వేయనివి 3, పునాదుల స్థాయిలో ఉన్నవి 4, పునాదులు పూర్తయినవి 27, గోడలు పూర్తయినవి 66, శ్లాబ్ స్థాయిలో ఉన్నవి 40, తుది దశకు చేరినవి 49 భవనాలున్నాయి. వైసీపీ పాలనలో ఆర్‌బీకేలకు భవనాలనే నిర్మించలేని దుస్థితిలో ఉన్న జగన్ సర్కారు వ్యవసాయాభివృద్ధి, రైతులకు సేవలందించడంపై ఉన్న శ్రద్ధ ఏపాటితో ఇట్టే స్పష్టమవుతున్నది. కొత్త ప్రభుత్వం గత పరిస్థితులపై అధ్యయనం చేసి ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని రైతులకు మేలైన సేవలను అందించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

ప్రజల రుణం తీర్చుకోలేనిది

ఏడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, ఐదు సార్లు మంత్రిగా పని చేసే అవకాశం ఇచ్చారు

- స్పీకర్ పదవిలో ఉన్నా నియోజకవర్గ ప్రజలే ముఖ్యం
- శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు



స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్‌లను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నర్సీపట్నం, జూన్ 29: ఏడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, ఐదు పర్యాయాలు మంత్రిగా పనిచేశానంటే అది నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం వల్లే సాధ్యమైందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన పౌర సన్మానంలో ఆయన మాట్లాడుతూ ఎన్ని జన్మలు ఎత్తినా ప్రజల రుణం తీర్చుకోలేనన్నారు. ఐదేళ్లు నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పరిశ్రమలు తీసుకు వచ్చి యువతకు ఉపాధి అవకాశాలు చూపిస్తానని ఎంపీ సీఎం రమేశ్ మాట ఇచ్చారని, కచ్చితంగా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారన్నారు. నర్సీపట్నంలో ఉండనని అనుకోవద్దని, తనకు నియోజకవర్గ ప్రజలే ముఖ్యమన్నారు. తన కుమారులు విజయ్, రాజేశ్ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఏ పని కావలసి వచ్చినా చేసి పెడతారని చెప్పారు. చంద్రబాబు ఒకటో తేదీన పెన్షన్ రూ.7వేలు ఇస్తున్నారని, నాయకులు దగ్గర ఉండి ఆ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. గత ఐదేళ్లు కేసులు పెట్టి దౌర్జన్యం చేసి ఇబ్బంది పెట్టారని, పోలీసులు తన మెడ మీద చెయ్యి పెట్టి జీపులోకి ఎక్కించారని గుర్తు చేసుకున్నారు.

అయ్యన్న అందరికీ ఆదర్శం : మంత్రి అనిత

రాజకీయాల్లోకి రావాలనుకునే వారికి అయ్యన్నపాత్రుడు ఆదర్శంగా నిలుస్తారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అయ్యన్నపాత్రుడు అవినీతి ఎరుగని నాయకుడని అన్నారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం పసుపు జెండాతో ఉంటానని, పసుపు జెండాతోనే పోతానని పార్టీ కోసం నిలబడ్డ నాయకుడని కొనియాడారు. అసెంబ్లీలో చంద్రబాబును తీవ్రంగా అవమానించిన జగన్‌కి ప్రతిపక్ష హోదా లేకుండా పోయిందని, ఇదే దేవుడి స్క్రిప్ట్ అని అన్నారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కలిసి సభాపతిని చైర్‌లో కుర్చోబెట్టడం సంప్రదాయమని, జగన్‌మోహన్‌రెడ్డికి ఆ ఇంకిత జ్ఞానం కూడా లేదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్‌లను నాలుగు మండలాలు, మునిసిపాలిటీ నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి విజయ్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, సుందరపు విజయ్‌కుమార్, కేఎస్ఎన్ రాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం - 8లో

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

- జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్
- పాడేరు జనరల్ ఆస్పత్రి సందర్శన
- ఖాళీలు భర్తీకి ప్రయత్నిస్తామని హామీ

పాడేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వార్డులు, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించానన్నారు. బోధనాస్పత్రి అనుమతుల జారీ చేయడానికి రెండు రోజుల క్రితం నేషనల్ కౌన్సిల్ బృందం వచ్చి పరిశీలించి వెళ్లిందన్నారు. జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి 120 పడకల నుంచి 420 పడకలకు పెంచడం జరిగిందన్నారు. ఆపరేషన్ థియేటర్‌కు ఆక్సిజన్ సౌకర్యం కల్పించాలని సూపరింటెండెంట్ కోరారని, అందుకు కృషిచేస్తామన్నారు. అలాగే మొత్తం మంజూరైన పోస్టుల్లో 30 శాతం మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన ఖాళీల భర్తీకి వైద్య శాఖ రీజనల్ డైరెక్టర్‌ను కోరుతామన్నారు. ఆహార సరఫరా గురించి రోగులను అడిగి తెలుసుకుని సంతృప్తి చెందారు. ఆస్పత్రిలో పిడియాట్రిషియన్ వైద్యుల సమస్య ఉందని, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఏజెన్సీలో పనిచేయడానికి స్పెషలిస్టు వైద్యులు ముందుకు రావడం లేదని, వారికి అదనపు ఇన్సెంటివ్ ఇచ్చి ... మిగతా 8వ పేజీలో



పాడేరు ఆస్పత్రి వార్డులో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

నిబంధనలకు పాతర.. అక్రమాల జాతర

ఏయూలో వీసీ ప్రసాదరెడ్డి ఇష్టారాజ్యం

- తనకు కావాల్సిన వారికి పోస్టింగ్‌లు...భారీగా వేతనాలు
- పోలీస్ శాఖలో రిటైరైన ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియామకం
- ఆయనకు అలవెన్సులతో కలిపి రూ.95 వేల వరకు చెల్లింపు



ఏయూలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):
ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ప్రసాదరెడ్డి అరాచకాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. ఆయన వీసీగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు భయపడిన ఎంతోమంది ఇప్పుడు గళం విప్పుతున్నారు. వర్సిటీ నిధులను ఆయన ఏ విధంగా దుర్వినియోగం చేసిందీ వివరిస్తున్నారు.

వర్సిటీలో చైర్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్...వంటి పేర్లతో కావాల్సిన వారికి కీలక విభాగాల్లో పోస్టింగ్స్ ఇచ్చిన ... మిగతా 8వ పేజీలో

ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- వ్యర్థ జలాలు గెడ్డల్లోకి విడుదల
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు



గెడ్డలో నల్లగా దర్శనమిస్తున్న ఫార్మా వ్యర్థ జలాలు

పరవాడ, జూన్ 29 :

ఫార్మాసిటీలోని కొన్ని ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. ఫార్మా వ్యర్థ జలాలను గుట్టు చప్పుడు కాకుండా బయటకు విడిచిపెట్టడంతో అవి గెడ్డల్లో దర్శనమిస్తున్నాయి. పీసీబీ అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని ఫార్మా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరవాడ నుంచి అనకాపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న స్థానిక మల్లోడి గెడ్డ కల్వర్టు వద్ద ఇరువైపులా ఫార్మా వ్యర్థ జలాలతో గెడ్డ నిండిపోయింది. ఈ కారణంగా ఆటుగా రాకపోకలు సాగించే వారంతా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలతో నీరంతా నల్లగా మారింది. నెలల తరబడి నీరు అక్కడే నిల్వ ఉండిపోవడంతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్లోడి గెడ్డ నుంచి ఫార్మా వ్యర్థ జలాలు నేరుగా పరవాడ సన్యాసిచెరువులో కలుస్తాయి. అక్కడి నుంచి పెద్ద చెరువులోకి కలుస్తాయి. సాగునీటి చెరువులోకి ఫార్మా వ్యర్థజలాలు కలిస్తే పంటలు పండే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫార్మా వ్యర్థ జలాల కారణంగా పరవాడ పెద్ద చెరువులో నాలుగు దఫాలు చేపలు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఫార్మా యాజమాన్యాల తీరు ఏ మాత్రం మారలేదు.

పత్తా లేని పీసీబీ అధికారులు

పెద్ద ఎత్తున ఫార్మా వ్యర్థ జలాలు గెడ్డల్లో దర్శనమిస్తున్నా పీసీబీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా వ్యర్థ జలాలను ఎట్టి పరిస్థితుల్లో కూడా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ కొన్ని ఫార్మా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫార్మా పరిశ్రమలు ఘన, ద్రవ వ్యర్థాలను రాంకీ యాజమాన్యానికి అప్పగించాలి. ఇందుకుగాను రాంకీకి కొంత నగదు కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని కావడంతో కొన్ని యాజమాన్యాలు గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను బయటకు విడిచిపెడుతున్నాయి. అటువంటి యాజమాన్యాలపై నిఘా పెట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పీసీబీ అధికారులపై ఉంది. అయితే ఇక్కడ మాత్రం పీసీబీ అధికారుల పర్యవేక్షణే లేకుండా పోయింది. దీంతో కొన్ని ఫార్మా యాజమాన్యాలు బరితెగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పరవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



స్థానిక మల్లోడిగెడ్డ కల్వర్టు వద్ద ఇరువైపులా దర్శనమిస్తున్న ఫార్మా వ్యర్థ జలాలు

నూకాంబికను దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అయ్యన్న పాత్రుడు



స్పీకర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, దాడి, పీలా

అనకాపల్లి టౌన్, జూన్ 29: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారిని శనివారం సాయంత్రం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దర్శించుకున్నారు. తొలిసారిగా వచ్చిన అయ్యన్నపాత్రుడుకు ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, వేదపండితుల ఆశీర్వాచనాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయ్యన్న అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి బాలాలయంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందజేశారు. స్పీకర్‌ని ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ యువ నాయకుడు దాడి జయవీర్ ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని, అమ్మవారి గర్భగుడిని పరిశీలించి నిర్మాణ పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత, అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఈవో బండారు ప్రసాద్, ఆర్డీవో చిన్నికృష్ణతో పాటు టీడీపీ నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, పీలా శ్రీనివాసరావు, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, కొణతాల రత్నకుమారి, కోట్ని బాలాజీ, బీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల సురేంద్ర, సబ్బవరపు గణేశ్, బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, జనసేన నాయకులు పీలా నాగశ్రీను, పొల్నాటి అప్పారావు, కర్రి సత్యనారాయణ, మళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 29: అసెంబ్లీ సభాపతిగా ఎన్నికై జిల్లాకు వచ్చిన చింతకాయల అయ్యన్నపాత్రుడుకు విశాఖ విమానాశ్రయంలో శనివారం ఘన స్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ విశాఖ విమానాశ్రయంలో శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు.

2న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

చోడవరం, జూన్ 28: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే జూలై 2న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 12 ప్రముఖ కంపెనీలుహాజరుకానున్నాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులు ఈ జాబ్‌మేళాను వినియోగించుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన పూర్తి వివరాలు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి సీనియర్ లెక్చరర్ హెచ్.సుధీర్ ఫోన్: 77806 88683లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం



అర్థగణాంక పితామహుడు మహాలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 29: కలెక్టరేట్‌లోని అర్థ గణాంక శాఖ కార్యాలయంలో శనివారం జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అర్థగణాంక శాఖ అధికారి రామారావు హాజరై అర్థగణాంక పితామహుడు మహాలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పాత భవనంలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభం

అనకాపల్లి టౌన్, జూన్ 29: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని గతంలో నిర్వహించిన భవనంలోనే మరికొద్ది రోజుల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. అన్న క్యాంటీన్ మూసివేసిన తర్వాత ఆ భవనంలో ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్ కొనసాగింది. ప్రస్తుతం ల్యాబ్ పనిచేయడం లేదు. ఇందులో విలువైన పరికరాలు ఉన్నాయి. దీంతో అన్న క్యాంటీన్‌ను వేరొక భవనంలో ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ వైద్యాలయం, జీవీఎంసీ అధికారులు భావించారు. ఇందుకు సంబంధించి జీవీఎంసీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అయితే అనుకున్న భవనం రోడ్డు పాయింట్‌లో లేకపోవడం, చిన్నది కావడంతో అధికారులు ఆ భవనంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి అంగీకరించలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యాలయం ఆవరణలోని రోడ్డుకు ఆనుకుని ఉన్న పాత భవనంలోనే అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు క్యాంటీన్ భవనంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పాత భవనంలో ఉన్న ల్యాబ్ పరికరాలన్నీ మరో భవనంలోకి శనివారం మార్పు చేశారు. త్వరలోనే అన్ని హంగులతో భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేయనున్నారు.



అనకాపల్లిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్న భవనం

లోక్‌అదాలత్‌లో రాజీతో మేలు

- జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య
- 82 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, జూన్ 29: లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకుంటే కక్షిదారులకు మేలు చేకూరుతుందని పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య మాట్లాడుతూ అనవసరమైన తగాదాలతో కేసుల్లో ఇరుక్కుని ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఆర్థికంగా కూడా సమస్యలు తలెత్తుతాయన్నారు. రాజీ మార్గంతో సమస్యలు పరిష్కరించుకుని కుటుంబంతో హాయిగా ఉండాలని సూచించారు. సమావేశంలో రెండో జూనియర్ సివిల్‌జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి బంధం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్‌లో 82 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి.

లోక్ అదాలత్‌లో 79 కేసులు పరిష్కారం

నర్సీపట్నం: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 79 కేసులను పరిష్కరించారు. శనివారం కోర్టు సముదాయంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పటాన్ షియాజ్ ఖాన్ 28, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదనరావు 51.. మొత్తం 79 కేసులు రాజీ మార్గంలో పరిష్కరించారు. డీఎస్పీ మోహన్, న్యాయవాదులు, వివిధ ప్రాంతాల నుంచి కక్షిదారులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ సభ్యత్వానికి మత్స్యలింగం రాజీనామా

విశాఖపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం విశాఖ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అరకు అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నేపథ్యంలో ఆయన హుకుంపేట జడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు.



విశాఖ ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్‌కు జడ్పీటీసీ పదవికి రాజీనామా పత్రం అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగా మత్స్యలింగం

అమరావతి నిర్మాణానికి వాకర్స్ క్లబ్ రూ.లక్ష విరాళం

నర్సీపట్నం, జూన్ 29 : అమరావతి నిర్మాణానికి నర్సీపట్నం వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. శనివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన పౌర సన్మాన కార్యక్రమంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, సీఎం రమేశ్‌కి ఈ చెక్కును అందజేశార. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడ, ఉపాధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ కుప్పిలి మూరళీ, కుప్పిలి స్వామి, ఊడా వెంటక్రావు తదితరులు పాల్గొన్నారు.



అమరావతి నిర్మాణానికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న నర్సీపట్నం వాకర్స్ క్లబ్ సభ్యులు

మైమరిపించిన మాయాబజార్

- ఘనంగా సురభి నాటకోత్సవాలు ప్రారంభం

విశాఖపట్నం, జూన్ 29: పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం రంగసాయినాటిక సంఘం ఆధ్వర్యంలో సురభి నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన మాయాబజార్ నాటిక సభికులను మైమరిపించింది. శశిరేఖ పరిణయం కథతో సాగే మాయాబజార్‌లో కళాకారులు అద్భుత నటనతో కనువిందు చేశారు. మద్యపాన మత్తులో బలరాముడు నారదుడ్ని తూలనాడడం, దీనికి ఆగ్రహించిన నారదుడు రేవతీదేవి వద్దకు వెళ్లి శశిరేఖకు అభిమన్యుడు కంటే ఉత్తర కుమారుడికి ఇచ్చివివాహం చేయడం మేలని కలహం రేపించే సన్నివేశాలు రక్తి కట్టించారు. శశిరేఖను అపహరించడానికి వచ్చిన ఘటోత్కచుడ్ని శ్రీకృష్ణుడు వృద్ధుడి మారు వేషంలో అడ్డుకునే చమత్కార ప్రదర్శనలు నవ్వులు పూయించాయి. ఘటోత్కచుడు శశిరేఖ రూపంలో ఉత్తర కుమారుడి పక్కన పెండ్లి పీటలపై చేసిన అల్లరి, పరాభవించే సన్నివేశాలు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించి అభిమానుల కరతాళధ్వనులు చూరగొన్నారు. చివరకు శశిరేఖ అభిమన్యుల వివాహంతో మాయబజార్ నాటిక ముగిసింది. ఈ కార్యక్రమంలో విజయ నిర్మాణ సంస్థ అధినేత విజయకుమార్, రంగసాయి నాటిక నిర్వాహకుడు బాదంగీర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

గంజాయి రవాణా కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

- రూ.20 వేలు జరిమానా

చోడవరం, జూన్ 29: గంజాయి రవాణాలో కేసులో ముగ్గురు నిందితులకు స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రెండేళ్ల జైలుశిక్షతో పాటు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ శనివారం తీర్పు చెప్పారు. ముంచంగిపుట్టు మండలం మకరం గ్రామానికి చెందిన ప్రధాని నాగేశ్వరరావు (40), ముఖి సిద్దేశ్ (35) ముఖి మోహన్(40)లు 2016, అక్టోబరు 25న స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మూడు గోనెసంచుల్లో 15 కిలోల గంజాయిని తరలిస్తుండగా, అప్పటి ఎస్ఐ నరసింహమూర్తి దాడి చేసి పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి శనివారం జిల్లా జడ్జి తుది తీర్పు ఇస్తూ ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 5 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. ఈ కేసులో అడిషనల్ పీపీగా వేసలపు వెంకటరావు వ్యవహరించారు.

బాలుడి ఆత్మహత్య

కూర్మన్నపాలెం, జూన్ 29: ప్రేమ విఫలం కావడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం ఆరారియా జిల్లాలోని సిరిసియా హనుమాన్ గంజ్ గ్రామానికి చెందిన రవీంద్ర రజాక్ అనే యువకుడు యాదవ జగ్గరాజుపేట వద్ద సమీపంలోని హీరావాట్ క్లాత్ కంపెనీలో గత రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. కాగా పది రోజుల క్రితం రవీంద్ర సోదరుడు శర్వణ్‌కుమార్ (16) విశాఖ నగరాన్ని చూద్దామని ఇక్కడకు వచ్చాడు. శుక్రవారం కూరగాయాలు తెచ్చేందుకు రవీంద్ర తన స్నేహితులతో కలిసి మార్కెట్ వెళ్లి వచ్చేసరికి తన తమ్ముడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని శర్వణ్‌కుమార్ కనిపించడంతో రవీంద్ర తమ యజమాని అశోక్‌కుమార్‌కు సమాచారం అందించాడు. ఆయన హుటాహుటిన వచ్చి తన కారులో శర్వణ్‌కుమార్‌ను కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తన తమ్ముడు తమ గ్రామంలో ఓ అమ్మాయిని ప్రేమించాడని, ప్రేమ విఫలం కావడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రవీంద్ర పోలీసులకు తెలిపాడు. మృతుడి తండ్రి బోలా రజాక్ వ్యవసాయదారుడు, తల్లి రాధాబాయ్ గృహిణి. వీరికి ఐదుగురు కుమారులు. రవీంద్ర ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది పోలీస్ అధికారుల పదవీవిరమణ



పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులతో ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 29 : జిల్లా పోలీస్ కార్యాలయ పరిధిలోని పనిచేస్తున్న తొమ్మిది మంది అధికారులు శనివారం పదవీవిరమణ పొందారు. క్రైం ఏఎస్పీ సత్యనారాయణరావు, డీటీసీ డీఎస్పీ రామవర్మ, మాకవరపాలెం ఎస్ఐ సన్యాసిరావు, బుచ్చెయ్యపేట ఎస్ఐ నాయుడు, వి. మాడుగుల ఎస్ఐ నాగరాజు, ఆర్ఎస్ఐ వెంకటరావు, నాతవరం ఏఎస్ఐ బంగ్రారాజు, కె. కోటపాడు ఏఎస్ఐ రాముడు, ఆర్మీ రిజర్వ్‌డ్ ఎస్ఐ శంకరరావు పదవీవిరమణ పొందారు. వీరిని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సత్కరించి, వీరంతా పోలీస్‌శాఖకు అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రికి పది ప్రత్యేక బస్సులు

ద్వారకా బస్‌స్టేషన్, జూన్ 29: ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం శనివారం విశాఖపట్నం నుంచి రాజమండ్రికి పది ప్రత్యేక బస్సులను నడిపింది. రీజియన్‌లోని విశాఖ, మద్దిలపాలెం డిపోల నుంచి వీటిని ఎంపిక చేసి ప్రత్యేక సర్వీసులుగా నడుపుతున్నారు. నిడదవోలు-కడియం స్టేషన్ల మధ్య రైల్వేట్రాక్‌ల నిర్వాహణ పనులను రైల్వే శాఖ చేపట్టడంతో ఈ స్టేషన్ల మీదుగా విశాఖకు రాకపోకలు సాగించాల్సిన జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ వంటి పలు రళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి ప్రయాణికుల డిమాండ్ అధికంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు విశాఖ-రాజమండ్రిల మధ్య ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. విశాఖ నుంచి రాజమండ్రికి ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు 40 నిమిషాల ఫ్రీక్వెన్సీతో బస్సులు ఉన్నప్పటికీ ప్రయాణికుల తాకిడి అధికంగా ఉండడంతో శనివారం పది ప్రత్యేక సర్వీసులను నడిపారు. డిమాండ్ ఇంకా కొనసాగితే మరిన్ని బస్సులు నడుపుతామని ఆర్టీసీ రీజియన్ అధికారులు తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ

విశాఖపట్నం, జూన్ 29 : డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వచ్చే నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 200 మంది అభ్యర్థులకు రెండు నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ రూ. 3 వేలు, రూ. వెయ్యి విలువైన స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, టీటీసీ, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు మాత్రమే), ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి, బీసీ స్టడీ సర్కిల్, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నం అన్న చిరునామాకు నేరుగా పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 94925 69177లో సంప్రతించాలని ఆమె సూచించారు.

నేటి నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టోర్నీ



ట్రోఫీ ఆవిష్కరణలో పాల్గొన్న జట్ల సారథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 29: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 టోర్నీ ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ప్రారంభం కానున్నది. ఇందుకు సంబంధించిన ట్రోఫీ ఆవిష్కరణ శనివారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టోర్నీలో పాల్గొనే ఆరు ఫ్రాంచైజర్ల జట్ల జెర్సీ యూనిఫామ్‌లను ఆవిష్కరించడంతోపాటు ఆటగాళ్లను పరిచయం చేశారు. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం, కడప స్టేడియంలలో జూలై 13వ వరకు జరిగే ఈ టోర్నీలో రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్, కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి మాట్లాడుతూ గత సీజన్లతో పోల్చితే సీజన్-3 టోర్నీని మరింత ఉన్నత స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేశామన్నారు. కార్యక్రమంలో ఏసీఏ ప్రతినిధులు, ఏపీఎల్ గవర్నింగ్ బాడీ సభ్యులు, ఐదు జట్ల సారథులైన కేఎస్ భరత్, రిక్కీబుయ్, గిరినాథరెడ్డి, జ్ఞానేశ్వర్, రషీద్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

నూతన వంగడాల అభివృద్ధికి పరిశోధనలు

ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి



చింతపల్లి, జూన్ 29: ఆచార్య ఎన్జీ రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రాజ్మా, వలిసెలు, వరిలో నూతన వంగడాల అభివృద్ధికి పరిశోధనలు చేస్తున్నామని ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లి నూనె గింజల పరిశోధన స్థానంలో ప్లాంట్ బ్రీడర్ విభాగంలో ప్రధాన శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై స్థానిక పరిశోధన స్థానంలో ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉన్నత పర్వతశ్రేణి ప్రాంతంలో అరుదైన పంటలు పండుతాయన్నారు. పరిశోధన స్థానంలో మూడేళ్లుగా ఉత్తర భారత దేశానికి పరిమితమైన అరుదైన పూలపై పరిశోధనలు నిర్వహించినట్టు చెప్పారు. తాజాగా విశ్వవిద్యాలయం గిరిజన రైతులకు అవసరమైన వంగడాలను అభివృద్ధి చేయాలని సూచించామన్నారు. ఇప్పటివరకు పరిశోధన స్థానంలో ప్లాంట్బ్రీడర్ ఎవరూ ఏడీఆర్గా పనిచేయలేదన్నారు. తొలిసారిగా పరిశోధన స్థానానికి ప్లాంట్బ్రీడర్ విభాగానికి చెందిన తనను ఏడీఆర్గా నియమించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో గిరిజన రైతులకు అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇప్పటికే రాజ్మా, వలిసెల పంటల్లో మేలు జాతి విత్తనాల కోసం పరిశోధన స్థానంలో పరిశోధనలు కొనసాగుతున్నాయన్నారు. కొన్ని విత్తనాలను గిరిజన ప్రాంతానికి అనువైనవిగా శాస్త్రవేత్తలు ప్రాథమికంగా గుర్తించారన్నారు. మరో రెండేళ్ల పాటు రాజ్మా, వలిసెల పంటలతో పాటు వరిలో పరిశోధనలు నిర్వహించి మంచి వంగడాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వంగడాల అభివృద్ధితో పాటు ఇతర పంటలపైనా పరిశోధనలు కొనసాగిస్తామన్నారు. పరిశోధన ఫలితాలు రైతులకు చేరవేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. రైతులు వ్యవసాయం ప్రగతి సాధించేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తామని ఏడీఆర్ వివరించారు.

విరబూసిన బ్రహ్మకమలం



చింతపల్లి, జూన్ 29: మండలంలోని బైలుకించంగి గ్రామంలోని ఓ ఉపాధ్యాయుడు పెరటిలో బ్రహ్మకమలం విరబూసింది. శనివారం సాయంత్రం బ్రహ్మకమలం మొగ్గలు ఒక్కొక్కటిగా విచ్చుకుని, సువాసనలు వెదజల్లాయి. జర్రెల గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు బైలుకించంగి గ్రామంలోని తన నివాసంలో కొన్నేళ్లుగా బ్రహ్మకమలం మొక్కలు పెంచుతున్నాడు. ప్రస్తుతం మొక్కలు పూతకురావడం, సాయంత్రం వేళ మొక్కలు విచ్చుకుని ఆకర్షణీయంగా కనిపించడంతో స్థానిక ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

పాఠశాల ఇలా.. చదువు సాగేదెలా?

చిన్న వంట షెడ్డులో బడి నిర్వహణ
ఎండ కాసినా.. వర్షం కురిసినా రక్షణ కరువు
పట్టించుకోని అధికారులు, పాలకులు
ఆదివాసీ విద్యార్థులకు తప్పని అవస్థలు

ఐదు తరగతులు.. 30 మంది విద్యార్థులు.. కర్రల దన్నుతో వేసిన చిన్న వంట షెడ్డులోనే క్లాసులు.. కటిక నేలపై కూర్చొని చదువులు.. ఎండ కాసినా, వర్షం కురిసినా కనీస రక్షణ లేక పడరాని పాట్లు.. ఇదీ గూడెంకొత్తవీధి మండలంలోని లక్కవరం గ్రామంలో ఆదివాసీ చిన్నారుల దుస్థితి.





కర్రల దన్నుతో గోడలు లేకుండా ఉన్న వంట షెడ్డులోనే నిర్వహిస్తున్న పాఠశాల... నేలపైనే కూర్చొన్న విద్యార్థులు

గూడెంకొత్తవీధి, జూన్ 29: దేవరాపల్లి పంచాయతీ లక్కవరం గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 30 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. గతంలో గ్రామస్థులు ఆదివాసీ చిన్నారుల విద్యాభ్యాసం కోసం ఒక పాకను నిర్మించారు. రెండేళ్ల క్రితం అది కూలిపోయింది. దీంతో గ్రామంలో ఓ గిరిజనుడు వంట చేసుకోవడానికి నిర్మించుకున్న చిన్న షెడ్డును విద్యా బోధనకు ఉపయోగిస్తున్నారు.

కనీస రక్షణ లేని ఈ షెడ్డులో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కటిక నేలపైనే కూర్చొని విద్యార్థులు చదుకోవాల్సి వస్తోంది. ఎండ కాస్తే నేరుగా చిన్నారులపైకి వేడి పడుతూ మంట పెడుతోంది. అలాగే వర్షం కురిస్తే కురిస్తే షెడ్డు పూర్తిగా కారిపోతోంది. చినుకులు పడినా గాలులకు విద్యార్థులపైకి నీరు వచ్చేస్తుంది. దీంతో ఆదివాసీ చిన్నారులు ప్రత్యక్ష నరకం చవిచూస్తున్నారు. గత్యంతరం లేక గ్రామంలోని ఏదో ఒక గృహం వరండాకు పరుగులు తీస్తున్నారు.

కర్రల దన్నుతోనే వేసిన షెడ్డు చుట్టూ ఎటువంటి గోడ లేకపోవడంతో విద్యార్థినీ, విద్యార్థులు ఈదురుగాలులు, చల్లగాలలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని పలుమార్లు గ్రామానికి వచ్చిన వైసీపీ పాలకులు, అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఎవరూ పట్టించుకునే పాపానికి పోలేదు. దీంతో లక్కవరం పాఠశాల విద్యార్థుల విద్యాభ్యాసానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి ఈ పాఠశాలకు శాశ్వత భవనం మంజూరు చేసి నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యాన్ని సహించం

» జిల్లా కలెక్టర్ దినేశ్కుమార్



వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్కుమార్

పాడేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, అందుకు బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్కుమార్ హెచ్చరించారు. ఈమేరకు దానిపై గిరిజన సంక్షేమ విద్యాశాఖాధికారులకు శనివారం ఆదేశాలు జారీ చేశారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తినా తక్షణమే ఆస్పత్రిలో చేర్పించి తగిన వైద్యం అందించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, ప్రతీ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన సేవలు అందించాలని చెప్పారు. అలాగే అవసరమైన అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ, ఏటీడబ్ల్యూవోలు విధిగా క్షేత్ర పర్యటనలు చేసి నిరంతరం ఆశ్రమ పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. విద్యార్థులను ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించినపుడు తప్పనిసరిగా ఒక టీచర్ లేదా డిప్యూటీ వార్డెన్ వెంట వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఆశ్రమ పాఠశాలలు తనిఖీకి వచ్చినపుడు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించనన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ దినేశ్కుమార్ సూచించారు.

వైద్య కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

స్థానిక మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను కలెక్టర్ దినేశ్కుమార్ శనివారం పరిశీలించారు. వైద్య విద్యార్థుల తరగతి గదులు, ల్యాబ్లు, బాలురు, బాలికల వసతిగృహాలు, నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణాలను తనిఖీ చేశారు. భవన నిర్మాణాల పనులకు పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని, ఏ అవసరం వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అంతకు ముందు వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతదేవీ, ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల విభాగం ఈఈ అచ్చెంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

'ఒకేసారి పింఛన్ పెంపుపై ప్రజలకు వివరించండి'

పాడేరు రూరల్, జూన్ 29: ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబు ఒకేసారి పింఛన్ పెంచిన విషయాన్ని ప్రజలకు వివరించాలని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి సూచించారు. ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు పెంచిన రూ.వెయ్యితో పాటు గత మూడు నెలలకు చెందిన రూ.3 వేలు కలిపి రూ.7 వేలును అందిస్తున్న ఘనత టీడీపీదేనన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.వెయ్యి పెంచి రూ.4 వేలు అందిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, గత ప్రభుత్వంలా ఏడాదికి రూ.250 కాకుండా ఒకేసారి పెంచి అందిస్తున్నారన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొనాలని, పెంపు విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఆమె కోరారు.

ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలి

పాడేరు రూరల్, జూన్ 29: జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్కృష్ణ కోరారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్తో వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో రోజురోజుకూ రోగాల బారినపడుతూ ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలు పునరావృతం కాకుండా హెల్త్ అసిస్టెంట్లను నియమించడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, ఎస్ఎఫ్ఐ నేత వరహాలు పాల్గొన్నారు.

నల్లరాయి క్వారీ బాధిత గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

పాడేరు రూరల్, జూన్ 29: హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీ బాధిత గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని సీపీఐ నేత అమర్ డిమాండ్ చేశారు. శనివారం క్వారీ బాధిత గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవలస నల్లరాయి క్వారీలో భారీ ఎత్తున బాంబు బ్లాస్టింగ్లు చేయడంతో స్థానిక ప్రజలు ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి క్వారీ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు శివశంకర్, ప్రసాద్, కోటిబాబు, సూరిబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్ఈ ప్రశాంత్కుమార్ బదిలీ



ప్రశాంత్కుమార్

సీలేరు, జూన్ 29: సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ.ప్రశాంత్ కుమార్ బదిలీ అయ్యారు. స్థానిక కాంప్లెక్స్ పరిధిలో రెండేళ్లుగా విధులు నిర్వహించిన ఎస్ఈని విజయవాడ ఏపీ జెన్కో కేంద్ర కార్యాలయానికి బదిలీ చేస్తూ శనివారం జెన్కో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కేంద్ర కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న కె.రామభద్రరాజును ఉద్యోగోన్నతిపై నియమించారు.

పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు

ముంచంగిపుట్టు, జూన్ 29: పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో కిరణ్కుమార్ తెలిపారు. పింఛన్దారులు ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని కోరారు. ఒకటిన పింఛన్ తీసుకోకపోతే 2వ తేదీన అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో పింఛన్ సొమ్ము రూ.4 వేలుకు పెంచడంతో పాటు ఎన్నికల హామీ మేరకు గత మూడు నెలలకు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు చప్పున 6319 మందికి పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

డుంబ్రిగుడలో 6521 మందికి పింఛన్లు

డుంబ్రిగుడ, జూన్ 29: మండలంలో 6521 మందికి పింఛన్లు అందించనున్నట్టు ఎంపీడీవో జయ ఉమ తెలిపారు. 18 పంచాయతీల పరిధిలోని 16 గ్రామ సచివాలయ ఉద్యోగులు 1వ తేదీనే ఇంటింటికీ వెళ్లి ఈ పింఛన్లను అందిస్తారని చెప్పారు. ఆ రోజు అందుబాటులో లేని లబ్ధిదారులకు 2వ తేదీన పింఛన్ పంపిణీ చేస్తామని ఆమె చెప్పారు.

వారపు సంతకు వర్షం దెబ్బ



వర్షం కారణంగా వెలవెలబోతున్న వారపు సంత

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతకు వర్షం దెబ్బ తగిలింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వాన పడడంతో సంతకు వచ్చిన అరకొర వినియోగదారులు సైతం త్వరతగతిన వెనుదిరిగారు. ఫలితంగా సంత అర్ధాంతరంగా ముగిసిపోయింది. దీంతో వ్యాపార లావాదేవీలు ఆశించిన స్థాయిలో జరగలేదు. అలాగే భారీ వర్షాలకు వాగులు, వంకలు, మత్స్యగెడ్డ పాయలు పొంగి ప్రవహిస్తున్నాయి.

ఇంటి వద్దకే పింఛన్లు

» అధికారులకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఆదేశం
» ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ



కాన్ఫరెన్స్లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, డీఆర్డీఏ పీడీ

పాడేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాల మేరకు జూలై ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకే సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సామాజిక పింఛన్ల పంపిణీపై శనివారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. బ్యాంకర్లతో మాట్లాడి అవసరమైన డబ్బును డ్రా చేయాలని, అవసరమైతే ఆదివారం సైతం బ్యాంకులను తెరిచి డబ్బులను డ్రా చేయాలన్నారు. ఎటువంటి జాప్యం లేకుండా తొలి రోజే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఒకటో తేదీన ప్రతి రెండు గంటలకు పింఛన్ల పంపిణీ శాతాన్ని అధికారులు పర్యవేక్షించాలన్నారు.

పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు : కలెక్టర్

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఎక్కువ, తక్కువగా పింఛన్లు అందినట్టు ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. లబ్ధిదారులకు రూ.7 వేలు అందినట్టు రశీదు పొందాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. పింఛన్ల పంపిణీని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్డీఏ పీడీ వి.మురళీ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయం వివరాలు సమర్పించాలి: కలెక్టర్

పాడేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను రెండు రోజుల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ దినేశ్కుమార్ సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేసిన ఖర్చులను సంబంధిత రికార్డుల్లో నమోదు చేసి నియోజకవర్గం వ్యయ పరిశీలకులతో రికన్సిలేషన్ చేసి సమర్పించాలని సూచించారు. వాటిని పూర్తిగా పరిశీలించిన తరువాత ఎన్నికల కమిషన్కు పంపించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎన్నికల వ్యయ పరిశీలకుడు నియోజకవర్గంలోని అభ్యర్థులకు లేదా వారి ప్రతినిధులకు అందుబాటులో ఉంటూ సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఎన్నికల నోడల్ అధికారి సువర్ణ ముఖి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ను కలిసిన గిడ్డి ఈశ్వరి



పాడేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ను తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శనివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గిరిజన ప్రాంతం అభివృద్ధికి చేపట్టాల్సిన విషయాలను మంత్రి లోకేశ్కు ఆమె వివరించారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్టుట ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి తెలిపారు.

కలెక్టర్ దృష్టికి గిరిజనుల సమస్యలు



జిల్లా కలెక్టర్ను కలిసిన రాజారావు, నాయకులు

పాడేరు రూరల్, జూన్ 29: జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన దినేష్ కుమార్ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు ఆధ్వర్యంలో నాయకులు శనివారం కలిసి గిరిజనుల సమస్యలను వివరించారు. ప్రధానంగా విద్య, వైద్యం, రహదారి, తాగునీటి సమస్యలను వివరించి పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ఉమామహేశ్వరరావు, రాఘవేంద్రరావు, సల్లా రామకృష్ణ, కె.కృష్ణారావు, ఎం.శాంత కుమారి, జి.కొండబాబు, సత్యవతి, వేమనబాబు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే శిరీషా



మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శిరీషా దంపతులు

పాడేరు రూరల్, జూన్ 29: అల్లూరి జిల్లాలోని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మను శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం సంప్రదాయ ప్రకారం పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శిరీషా దంపతులను శాలువతో కప్పి సత్కరించారు. అలాగే అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కాగా, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆలయం వద్దకు చేరుకొని ఎమ్మెల్యే శిరీషాకు స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి గృహానికి శిరీషా చేరుకుని కార్యకర్తలతో సమావేశమయ్యారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ దినేష్కుమార్ను కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు.





మన్యంలో ఫొటోగ్రాఫర్లు తీసిన అందమైన జలపాతం... అరకులోని అంజోడా ఫాంలో ఫొటోలు తీస్తున్న ఫొటోగ్రాఫర్లు

అరకులో జాతీయ కెమెరా దినోత్సవం

అరకులోయ, జూన్ 29: మండల కేంద్రంలో వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ శనివారం జాతీయ కెమెరా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూడురోజులు పాటు ఫొటోగ్రాఫీ వర్క్షాప్ ,సదస్సు నిర్వహిస్తున్నారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు ఆర్ట్ ఫొటోగ్రాఫర్లు మూడు రోజులుగా అరకులోయ, పాడేరు, చింతపల్లి, లంబసింగి ప్రాంతాల్లోని గ్రామాల్లో బృందాలుగా పర్యటించి మన్యంలో ప్రకృతి, సహజసిద్ధమైన అందాలతో పాటు గిరిజనుల జీవనశైలి, ఆచార, వ్యవహారాలపై దృష్టిసారించి తమ కెమెరాల్లో బంధించే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా శనివారం అరకులో ఈ కార్యక్రమం చేపట్టారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఫొటోగ్రాఫర్ కొర్లపాటి సరస్వతిరావు ఈ సందర్భంగా పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్టిల్ లైఫ్, నేచర్ ఫొటోగ్రాఫీపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల ఫొటోగ్రాఫర్లు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, జూన్ 29: రాగల ఐదు రోజుల్లో అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో రెవెన్యూ, అత్యవసర విభాగాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయంలో క్షేత్ర స్థాయి ఉద్యోగులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలపై వీఆర్వోలు గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అలాగే ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా రెవెన్యూ ఇరిగేషన్, విద్యుత్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ తగిన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అలాగే ఆర్వోఎఫ్ఆర్ భూముల సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు సకాలంలో పంపిణీ చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర, అక్రమాల జాతర

... 5వ పేజీ తరువాయి

వీసీ..వారికి భారీ మొత్తాలను చెల్లించినట్టు చెబుతున్నారు. అలాగే, గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని కేడర్లు సృష్టించి మరీ ఉద్యోగాలు కల్పించి లక్షలాది రూపాయలు జీతాలుగా చెల్లించారు. రిటైరైన కృష్ణమోహన్ను ఓఎస్డీగా నియమించారు. ఇంకా ఇంజనీరింగ్ కాలేజీకి కూడా ఓఎస్డీని వేశారు. అదేవిధంగా దూరవిద్యా కేంద్రానికి డైరెక్టర్గా ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన వ్యక్తిని, ప్లేస్మెంట్ ఆఫీసర్లుగా పలు కాలేజీలకు సంబంధించిన ముగ్గురిని నియమించారు. వీరికి భారీ మొత్తంలో యూనివర్సిటీ నిధుల నుంచి వేతనాలను చెల్లిస్తున్నారు. వీరితోపాటు కొన్ని విభాగాల్లో కింది స్థాయిలో కొందరికి ఉద్యోగాలను వీసీ కల్పించినట్టు చెబుతున్నారు. పోలీస్ శాఖలో రిటైరైన ఖాన్ను తీసుకువచ్చి వర్సిటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్గా నియమించి నెలకు రూ.75 వేలు వేతనంతో పాటు మరో రూ.20 వేలు అలవెన్స్ ఇస్తున్నారు. మొత్తం రూ.95 వేలు వర్సిటీ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. యూనివర్సిటీలో అప్పటికే సుమారు 100 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తుండగా, ఖాన్ తనకు కావాల్సిన మరో 50 మందిని సెక్యూరిటీ సిబ్బందిగా తీసుకున్నారు. వీరంతా ప్రసాదరెడ్డి సేవలోనే తరించేవారు. ఏయూలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి రూ.10 వేలకు మించి వేతనాలు చెల్లించడం లేదు. ఖాన్ తీసుకువచ్చిన సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం అలవెన్సులతో కలిపి సుమారు రూ.20 వేలకుపైగా ఇస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందిగా నియామకం సమయంలో ఖాన్కు వారంతా భారీగానే సమర్పించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, ఖాన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్గా నియమితులైన తరువాత ట్రాన్స్పోర్ట్ డీన్గా కూడా వీసీ అవకాశం కల్పించారు. ఈ బాధ్యతలను ఖాన్ 'చక్కగా' వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ఏయూ వాహనాలకు ఆయిల్, నిర్వహణ పేరుతో నిధులు దుర్వినియోగం చేశారంటున్నారు. పూర్తిగా మూలకు చేరిన వాహనాలను విక్రయించుకున్నారని... ఆయన తీసుకున్న నిర్ణయాలపైనా విచారణ చేయాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

దాతల ఇచ్చిన నిధుల లెక్క..?

గత ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా యూనివర్సిటీ అధికారులు దాతల నుంచి భారీగా నిధులు సేకరించారు. కొందరు సొంత నిధులతో భవనాలు కట్టించగా, మరికొందరు వర్సిటీ అభివృద్ధికి వినియోగించాలంటూ నిధులు అందించారు. ఈ నిధులను ఏ ఖాతాలో జమ చేశారన్న దానిపై వర్సిటీ అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం. వీటి వినియోగంపైనా దృష్టిసారిస్తామని కూటమి నేతలు శనివారం ప్రకటించారు.

ప్రక్షాళన చేయాల్సిందే!!

ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సి ఉంది. ఉప కులపతి పదవి నుంచి ప్రసాదరెడ్డి తప్పుకున్నా ఆయన అడ్డగోలుగా నియమించిన అనేక మంది అక్కడ పాతుకుపోయారు. క్యాంపస్లో ఏమి జరిగినా క్షణాల్లో సమాచారం అందేలా ప్రసాదరెడ్డి ఏర్పాట్లు చేసుకున్నారు. ఏయూ వెబ్సైట్లో ఇంకా వీసీగా ఆయన పేరు, ఫొటో ఉన్నాయి. దీనిని పలువురు ప్రొఫెసర్లు ప్రశ్నిస్తే... తమకు పై నుంచి ఆదేశాలు రాలేదని, వచ్చేంతవరకూ అలాగే ఉంచుతామని వెబ్సైట్ నిర్వహించే బృందం చెప్పడం గమనార్హం. ఆయన సిబ్బందిని ఎలా తయారుచేసుకున్నారో చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. ప్రసాదరెడ్డి రాజీనామా తరువాత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ముగ్గురు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్లు శనివారం క్యాంపస్కు వెళ్లారు. ఇంత జరిగినా వెబ్సైట్ నుంచి ఆయన పేరు తొలగించడానికి సిబ్బంది అంగీకరించలేదు. ఆయన రాజీనామాకు గవర్నర్ ఆమోదం లభిస్తే అప్పుడు తొలగిస్తానని చెప్పడం గమనార్హం.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

... 5వ పేజీ తరువాయి

నియమిస్తామన్నారు. అలాగే ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉందని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్వోలు) క్యాన్సర్ డైగ్నోసిస్ శిక్షణ పొందుతున్నారన్నారు. అలాగే ఎంపీతో మాట్లాడి ఎంపీ లాడ్స్ నిధుల నుంచి అంబులెన్స్లు సమీకరిస్తామని కలెక్టర్ దినేశ్కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఎంపీడీవో సాయినవీన్, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.